సాక్షి పెద్దపల్లి

సోమవారం । 25 । మార్చి । 2024



ఘనంగా మట్టల పండుగ

రామగిరి : బిట్టుపల్లి గ్రామంలో ఆదివారం మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. పలువురు క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ(సా॥)	సహర్ మంగళ(ఉ॥)
కరీంనగర్	6.27	4.47
పెద్దపల్లి	6.34	4.54
రాజన్న సిరిసిల్ల	6.34	4.54
జగిత్యాల	6.34	4.54

గరిష్ఠం/కనిష్ఠం 37.2/23.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వేడి గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మల్లన్నస్వామికి పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కోనేటిలో స్నానాలు ఆచరించి మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామిని దర్శనం చేసుకున్నారు. హుండీలో కానుకలు వేశారు. ఒగ్గుపూజారులతో స్వామివారికి పట్నాలు వేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో మేకల మల్లేశంయాదవ్, వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్యావరణ హితంగా హోలీ జరుపుకోవాలి



ఎన్.బలరాం

గోదావరిఖని: పర్యావరణ హితంగా హోలీ పండుగ జరుపుకోవాలని సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం సూచించారు. రంగుల పండుగ హోలీ పండుగ సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆయన హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈపండుగ అందరి జీవితాల్లో ఆనందం నింపాలని సింగరేణి సీఎండీ బలరాం ఆకాంక్షించారు.

స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, వృత్తివిద్యా కాలేజీల్లో చదివే మైనార్టీ విద్యార్థులు 2023–24 ఆర్థిక సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ కోరారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తు చేసి, హార్డ్‌కాపీలను కళాశాలలో అందించాలని ఆయన సూచించారు.

ఉచిత శిక్షణకు నేడు ఆఖరు గడువు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామని, ఇందులో శిక్షణ పొందేందుకు ఆసక్తి గల వారు ఈనెల 25వరకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి తెలిపారు. ట్రెయినింగ్ ప్రోగ్రాం పూర్తయిన వారికి ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. పూర్తివివరాలకు ఫోన్ నంబరు 040–29303130లో సంప్రదించాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ కోసం..

పెద్దపల్లిరూరల్: ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1,500 బుక్‌ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ కావాలనుకునే వారు ఏప్రిల్ 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పూర్తి వివరాలకు 040–24071178, 040–27077929 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్‌జేసీ సెట్, బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ డిగ్రీ కాలేజీలో ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్‌డీసీ సెట్ ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతం కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13బాలుర, 13 బాలికల జూనియర్ కాలేజీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతగల వారు నిర్ణీత రుసుం చెల్లించి ఏప్రిల్ 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఓదెలలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు

ఓదెల(పెద్దపల్లి): మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పేరుకుపోయిన కేసుల సత్వర పరిష్కారం కోసం కోర్టు మంజూరు చేస్తూ ఈనెల 14న ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం కోర్టు మంజూరుపై ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ.. సౌకర్యాల లేమి

- పెరుగుతున్న ఎండల తీవ్రత
- నీడలేదు.. నీరు పెట్టరు
- కానరాని మెడికల్ కిట్లు
- పనిస్థలాల్లో వసతులు కరువు
- సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం



ఎండలో పనిచేస్తున్న ఉపాధిహామీ ఈ కూలీలు రామగిరి మండలం కల్వచర్ల గ్రామస్తులు. గతంలో ఎండ తీవ్రతతో చాలామంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. సకాలంలో వైద్యం అందక కొందరు చనిపోయారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో పనిప్రదేశంలో నీడ ఉండేలా టెంట్లు ఏర్పాటు చేయాలి. అధికారులు పట్టించుకోవడంలేదు. కూలీలు ఎండలోనే ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నారు.



రాజాపూర్ గ్రామంలో ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సాక్షి, పెద్దపల్లి: పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఉపాధిహామీ కూలీలు అల్లాడుతున్నారు. పనిప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి వసతి కల్పించాలనే నిబంధనలు ఎక్కడా కనిపించడం లేదు. అసలే భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తుండడం.. మరోవైపు సౌకర్యాల లేమితో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంతో కొనుగోలు చేసిన వేసవికిట్లు పాడైపోయినా.. కొత్తవి కొనుగోలు చేయడం లేదు. ఎండలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్న తరుణంలో ఉపాధిహామీ కూలీలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. కానీ వారి నిర్లక్ష్యంతో ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నా.. ఏమూలకూ సరిపోవడం లేదని, ఉదయం 10 గంటలు దాటితే ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న మంచినీరు అయిపోతున్నాయని కూలీలు వాపోతున్నారు. ఊరుకు దూరంగా పనులు చేస్తున్నందున మళ్లీ తెచ్చుకోలేక ఉన్న నీటితోనే సరిపెట్టుకుని డీహైడ్రెషన్‌కు గురవుతున్నారు.

ఇంటి నుంచే మంచినీళ్లు..

- ఉపాధిహామీ కూలీలు పనిచేసేచోట తాగునీటి సౌకర్యంతోపాటు శక్తినివ్వడానికి ఎలక్ట్రోల్ పౌడర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.
- క్షేత్రస్థాయిలో ఇలాంటి ఆనవాళ్లు ఎక్కడా కనిపించడం లేదు.
- చేసేది లేక కూలీలు పనులకు వచ్చే సమయంలో తమతోపాటు బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు.
- కూలీలు సేదతీరాలంటే చెట్లు, పుట్టలను వెతుక్కోవలసిన పరిస్థితి నెలకొంది.
- మరోవైపు ఉపాధిహామీ కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు అందడం లేదు.
- దీంతో కూలీలే వాటిని సొంతంగా సమకూర్చుకుని పనులకు వెళ్తున్నారు.

ఉపాధిహామీ వివరాలు

జాబ్‌కార్డులు	76,362
నమోదైన కూలీలు	2,41,076
కుటుంబాలు	1,17,673
పనిచేస్తున్న కూలీలు	1,25,123
సగటు వేతనం (రూ.లలో)	183.87

అందని వేతనాలు

ఉపాధి పనులు చేసిన కూలీలకు సక్రమంగా బిల్లులు అందడం లేదు. 15రోజులకోసారి వేతనాలు అందించాల్సి ఉండగా నెలరోజులు దాటినా వేతనాలు బ్యాంకుల్లో జమకావడం లేదు. చాలాచోట్ల జనవరి 15వరకు మాత్రమే కూలీల వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఫిబ్రవరి, మార్చి వేతనాలు వేయలేదని కూలీలు వాపోతున్నారు.

వేసవి భత్యం అందేనా..?

- ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా గతంలో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఉపాధిహామీ కూలీలకు 20శాతం అదనపు వేసవి భత్యం చెల్లించేది.
- ప్రస్తుత ఏడాది నుంచి ఉపాధి చెల్లింపులు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఐసీ సర్వర్‌కు వెళ్లడంతో అందులో రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకునే వీలులేకుండా పోయింది.
- దీంతో కేంద్రప్రభుత్వం వేసవి భత్యం ఇచ్చే అవకాశం లేకపోవడంతో వేసవిలో పనిచేసే కూలీలకు అదనపు భత్యం రాకుండా పోతోంది.
- దీనికితోడు ఎండల తీవ్రత పెరగడం, వసతుల లేమి తదితర కారణాలతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని అధికారులు పేర్కొంటున్నారు.
- ఇదే విషయమై డీఆర్‌డీవో రవీందర్‌ను వివరణ కోరగా పనిప్రదేశాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- తాగునీటి కోసం ఒక్కోకూలీకి రోజుకు రూ.2చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నామని తెలిపారు.

కనీస వసతులు లేవు



గ్రామాల్లో చెరువులు, కాలువల్లో పూడికపనులు జరుగుతున్నాయి. నీళ్లు, నీడ, మందులు లేవు. చేసిన పనికి డబ్బులు ఆలస్యంగా పడుతున్నయి. ఎండకాలం భత్యం ఊసేలేదు. కనీసం నీడ సౌకర్యం లేక చెట్ల కింద వడగాడ్పుల మధ్యనే ఇబ్బంది పడుతూ పనులు చేస్తున్నం.

– సిరిసేటి నారాయణ, కూలీ, కొలనూరు

చేతికొచ్చేదెలా..!





తాగునీటి బావి నుంచే పంటకు..

పెద్దపల్లి మండలం మూలసాల హుస్సేనిమియావాగులో ప్రజలకు తాగునీరు అందించే బావి నుంచి పంటలకు నీరు తరలిస్తున్నాడో రైతు. ప్రజల దాహం తీర్చే తాగునీటిని పంటకు అందించేందుకు బావిలో మోటారు అమర్చుకున్నాడు. అక్కడి నుంచి పొలం వరకు పైప్‌లైన్ వేసుకుని అవసరమైన నీరు తరలిస్తూ పంటను కాపాడుకుంటున్నాడు.

- చేతికి అందేదశలో పంటలు
- నీళ్లు అందక ఎండుతున్న పైనం
- వరిని బతికించేందుకు రైతుల తంటాలు
- ఎడారిని తలపిస్తున్న హుస్సేనిమియావాగు



ఈ చిత్రంలోని రైతు పేరు బండారి పుల్లయ్య. పెద్దపల్లి మండలం కనగర్తి స్వగ్రామం. తనకున్న 1.32 ఎకరాల్లో ఈ యాసంగిలో వరి సాగు చేశాడు. ప్రస్తుతం నీరు అందక వరి ఎండిపోతోంది. అధికారులు స్పందించి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు అందిస్తే పంటను కాపాడుకునే వీలు ఉందని వేడుకుంటున్నాడు.

పెద్దపల్లిరూరల్: ఈ యాసంగిలో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం చేతికి అందే దశకు చేరింది. ఈ సమయంలోనే నీరు అందడంలేదు. ఇప్పటివరకు ఎలాగోలా పంటను కాపాడుకున్న రైతులు.. మరోనెల వరకు కాపాడుకునేదెలా? అని ఆందోళన చెందుతున్నారు. పెద్దపల్లి ప్రాంతంలో భూగర్భ జలాల వృద్ధి, వ్యవసాయ రంగానికి సాగునీరు అందించే హుస్సేనిమియావాగు ఎడారిని తలపిస్తోంది.

జల జగడం..

- ప్రస్తుతం సాగునీటి కష్టాలు తలెత్తడంతో పంటను కాపాడుకోవాలన్న ఆరాటంతో పొరుగు మండలాలకు చెందిన రైతులు తమ ప్రాంత ప్రజాప్రతినిధి అండతో ఎస్సారెస్పీ కాలువ నీటిని తరలించుకుపోయేందుకు యత్నించారు.
- ఈక్రమంలో నాలుగైదు రోజుల క్రితం 'జల జగడం' తీవ్రస్థాయిలోనే జరిగినట్లు తెలిసింది.
- ఎస్సారెస్పీ డీ–83 కాలువ నీటిని అంతర్గాం, పాలకుర్తి మండలాలకు తరలించుకుపోయేలా ఆ ప్రాంత రైతులు పెద్దసంఖ్యలో అర్ధరాత్రి సమయంలో వచ్చారు.
- ఈ విషయాన్ని తెలుసుకున్న పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామ రైతులు కూడా పెద్ద సంఖ్యలోనే అక్కడకు చేరుకుని వారితో వాగ్వాదానికి దిగారు.
- ఓ దశలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగినట్లు సమాచారం.
- ఓ వర్గ రైతులకు సహకరించాలని ఓ ప్రజాప్రతినిధి పోలీసు అధికారికి సూచించడంతో వారికి మద్దతుగా వచ్చిన పోలీసు అధికారి.. ఇరువర్గాల మధ్య గొడవ పెరిగేట్టు ఉందని సదరు ప్రజాప్రతినిధికి చెప్పి వారిని వెనుదిరిగేలా చేసినట్లు తెలిసింది.

ఎడారిలా హుస్సేనిమియావాగు

ఏడాది పొడవునా నీటితో పారాల్సిన హుస్సేనిమియావాగు ప్రస్తుతం చుక్క నీరు లేక ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. శ్రీరాంసాగర్ కాలువ ద్వారా వచ్చే నీటిని ఈ వాగు, ఊళ్లు, చెరువులోకి మళ్లించేవారు. అ నీటి నిల్వలతో ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందేవి. ఈసారి పరిస్థితులు తారుమారయ్యాయి. ఎస్సారెస్పీలోనే నీటిమట్టం పడిపోతుండడంతో వారబందీ పద్ధతిన సాగునీరు సరఫరా అవుతోంది. దీంతో వాగులు, చెరువుల్లోకి మళ్లించే మాట దేవుడెరుగు.. కనీసం పంటలకు అవసరమైన నీటికే దిక్కు లేకుండా పోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు సవరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి



మాట్లాడుతున్న నాయకుడు తిరుపతి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలను తక్షణమే సవరించాలని, జీవో నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఓసీపీ–3 ఆర్‌వీఆర్ కంపెనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16ఏళ్ల నుంచి రాష్ట్రంలో కనీస వేతనాల సవరణ జరగలేదన్నారు. ప్రజలు, కార్మికులు తమ జీవితాలు బాగుపడతాయని మార్పును కోరుకొని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. ఇప్పటికైనా వేతనాలను శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా సవరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలకు అనుకూలంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాల నోటిఫికేషన్ విడుదల చేయడం, అందులో ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలనే ప్రతిపాదనలేదని విమర్శించారు. గత ప్రభుత్వం 2021 జూన్‌లో విడుదల చేసి గెజిట్ చేయకుండా పెండింగ్‌లో పెట్టిన జీవో నంబర్ 22, మరో నాలుగు జీవోల అమలుకు హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను తెలియజేస్తూ ఈనెల 26న హైదరాబాద్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించనున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ రఫిక్‌పాషా, భాస్కర్, కుమారస్వామి, కనకరాజు, శ్రీధర్‌గౌడ్, ప్రసాద్, సిరాజ్, సంపత్, మహేందర్, అల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం

- టీబీజీకేఎస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ముందుకు సాగుతోందని ఆ యూనియన్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మిక హక్కుల సాధన కోసం దశల వారీగా ఉద్యమ కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 30 మంది సభ్యులతో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. చర్చల కమిటీ ప్రతినిధులు, కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు ఇందులో ఉంటారని పేర్కొన్నారు. కార్మిక సంఘం నిబంధనల మేరకు యూనియన్ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కార్మిక వర్గం, వారి కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు. గనిస్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఏప్రిల్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. సమావేశంలో యూనియన్ స్టీరింగ్ కమిటీ నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, ఎల్.వెంకటేశ్, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, చెలుకలపల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, సర్వోత్తంరెడ్డి, పులిపాక శంకర్, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, గడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టీరింగ్ కమిటీ తీర్మానాలివే..

- కొత్త గనులు ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా పోరాటం చేయడం
- కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడానికి ఉద్యమించడం
- గనిప్రమాదాల నివారణకు మెరుగైన రక్షణ చర్యలు చేపట్టాలి
- సింగరేణిలో కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ రంగంలో కొత్త గనులు ప్రారంభించేలా యాజమాన్యం కార్యాచరణ రూపొందించాలి
- బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి. జీవో ఎంఎస్ నంబర్ 22 అమలు చేయాలి
- ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీచేయాలి
- ఉద్యోగ ఖాళీలను అర్హులైన అంతర్గత అభ్యర్థులకు 80 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలి
- రక్షిత మంచినీరు సరఫరా చేయాలి
- సీబీఎస్‌ఈ స్కూళ్లలో కార్మికుల పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్య అందించాలి.



కాముని దహనం

రామగుండం: పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆదివారం రాత్రి కాముని దహనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోలీ పర్వదినం సందర్భంగా ఒకరోజు ముందుగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనాయితీ. ఇందులో భాగంగా పట్టణ ప్రముఖులు, స్థానికుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీలం నాగభూషణం, జాగటి శ్రీకాంత్‌కుమార్, వనగంటి రవిచందర్, గుర్రాల నర్సింహులు, తోకల రాయమల్లు, రవికుమార్, బోనగిరి కుమార్, ముస్త్యాల శంకర్‌లింగం, శ్రీనివాస్, సత్యనారాయణ, గుంటి దేవేందర్ పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

గోదావరిఖనిటౌన్: ట్రస్టులు, దేవాలయాలు, తోటలు తదితర విభాగాల్లో మినహాయింపులు ఇచ్చిన పాలకులు భూ సంస్కరణలు నీరుగార్చారని తెలంగాణ రైతు సంఘాల నేత వర్ణ వెంకటరెడ్డి విమర్శించారు. స్థానిక హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో రైతు సమస్యల పరిష్కార సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు అవసరమైన పంట పండించే దుస్థితి నుంచి అన్నదాతలను బయటకు తీసుకు రావాలని కోరారు. వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సింగరేణికి భూమి ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, పనిపూర్తి అయిన తర్వాత పంటలు పండించేలా రైతులకు సహకారం అందించాలని కోరారు. అసైన్డ్ భూములను బడుగు, బలహీన, దళితవర్గ రైతులకు పంచాలని డిమాండ్ చేశారు. రైతు నల్లచట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రచయితల సంఘం నేత ఏలేశ్వరం వెంకటేశ్, పలు సంఘాల నేతలు ముడిమాడుగుల మల్లన్న, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, రియజ్ అహ్మద్, కోడిపుంజుల రాజన్న, ఎరుకల రాజన్న, సుదర్శన్, గుమ్మడి వెంకన్న, నగేశ్ పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి చక్రస్నానం కనులపండువగా జరిపించారు. వేదపండితుడు జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మధుసూదనాచార్యులు, భానుప్రసాదాచార్యుల మంత్రోచ్ఛరణలతో ఈ ప్రక్రియ నిర్వహించారు. సింగరేణి ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, మాలతి దంపతులు ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సింగరేణి ఉద్యోగులు, కాలనీవాసులకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని జీఎం వేడుకున్నారు. ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, అలివేణి, ఆలయ కమిటీ సభ్యులు, ఎస్‌వోటూ జీఎం రవీందర్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీజీఎంలు హరినారాయణ, మురళీకృష్ణ, సివిల్ జేఈ రాధాకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామప్పను సందర్శించిన న్యాయమూర్తులు


నందీశ్వరుని వద్ద ఆరు జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయాన్ని ఆదివారం ములుగు, కరీంనగర్, నిర్మల్, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల న్యాయమూర్తులు లలిత శివజ్యోతి, బి.ప్రతిమ, ఎ.కర్ణాకుమార్, పి.లక్ష్మీశారద, పి.చంద్రశేఖరప్రసాద్, ఎస్.శ్రీదేవి సందర్శించారు. శ్రీరామలింగేశ్వరస్వామికి పూజలు చేసిన అనంతరం వారికి పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం నందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ శిల్పాకళాసంపద గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.

వరదకాలువకు నీరు విడుదల చేయండి


వరదకాలువ వద్ద రైతులతో పోలీసులు

గంగాధర(చొప్పదండి): వరద కాలువకు నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై కురిక్యాల శివారులోని వరద కాలువ వంతెనపై ఆందోళన చేపట్టేందుకు మండలంలోని కొండన్నపల్లి, రంగరావుపల్లి, ఆచంపల్లి, గర్శకుర్తి తదితర గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్సై కిరణ్‌రెడ్డి రైతుల వద్దకు చేరుకొని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో ఫోన్‌లో మాట్లాడించారు. వరద కాలువకు నీటిని విడుదల చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి శివారులో కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. చిప్పలపల్లికి చెందిన పడిగె మల్లయ్య(54) గంభీరావుపేట మండలం లింగన్నపేట నుంచి బైక్‌పై చిప్పలపల్లికి వస్తుండగా.. ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మల్లయ్యను ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లయ్య మృతి చెందాడు. వ్యవసాయం, కూలీ పనులు చేసే మల్లయ్య భార్య మణెమ్మ ఆరు నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాచ్‌మన్‌కు తీవ్రగాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్‌లో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో హాస్టల్ వాచ్‌మెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోతుగల్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రహీం(55) ముస్తాబాద్ నుంచి పోతుగల్‌కు శనివారం రాత్రి నడిచి వెళ్తుండగా ద్వి చక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రహీం ఎడమ కాలు విరిగింది. హాస్టల్ సిబ్బంది రహీంను హైదరాబాద్‌కు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి..

బోయినపల్లి(చొప్పదండి): కొదురుపాక ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. కొదురుపాకకు చెందిన దేవయ్య ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వైపు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దేవయ్యకు గాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

శ్రీరామకోటి స్తూపం ప్రారంభించరూ..

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో రూ.38లక్షల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్), మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ రూ.10 లక్షల నిధులతో మార్చి 2021లో శ్రీరామకోటి స్తూప నిర్మాణానికి భూమిపూజ చేశారు. 2023 వరకు నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. కాగా ఈ స్తూప నిర్మాణం దేవాదాయ ప్రణాళికలో లేకుండానే చేపట్టారు. అయినా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్తూపాన్ని అలంకార ప్రాయంగా వదిలేశారు.

ఆలయ ప్రణాళికలో లేకుండానే..

ఆలయ ప్రణాళికలో లేనటువంటి శ్రీరామకోటి స్తూప నిర్మాణం కేవలం గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీ కవిత కోరిక మేరకు మొదలుపెట్టి పూర్తి చేశారని వినికిడి. కాగా స్తూపం పనులు 60 శాతం పూర్తయిన సమయంలో పలువురు స్థపతులు పరిశీలించారు. స్తూప నిర్మాణం వాస్తురీత్యా విరుద్ధంగా చేపట్టారని పేర్కొన్నారు. దీంతో స్తూపం ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. కాగా భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ఎక్కడ ఇవ్వాలో తెలియక, ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో వదిలి వెళ్తున్నారు. ఎంతో ఆర్భాటంగా నిర్మించిన స్తూపం వద్దే భక్తులు వంటలు చేసుకోవడం, స్టాండ్‌లపై బట్టలు ఆరవేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దేవాదాయ శాఖ, ప్రభుత్వం స్పందించి శ్రీరామకోటి స్తూపాన్ని ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.


శ్రీరామకోటి స్తూపం స్టాండ్‌లపై బట్టల ఆరవేత

ఫంక్షన్ హాళ్లలో చోరీలకు పాల్పడిన దొంగల అరెస్ట్

కరీంనగర్‌క్రైం: ఫంక్షన్‌లలో సామగ్రి, బ్యాగులు దొంగలిస్తున్న ఇద్దరు వ్యక్తులు, ఒక మైనర్ బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన మహమ్మద్ రహీం బొమ్మకల్ ఫ్లైఓవర్ దగ్గరలోని అమ్మనిష్ సెంటర్‌లో జిమ్ శిక్షకుడిగా పని చేస్తున్నాడు. అతడికి 12 ఏళ్ల బాలుడు పరిచయం కాగా, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఫంక్షన్ హాళ్లలో వివిధ వస్తువులు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రహీం తన స్నేహితుడైన ఆటోడ్రైవర్ మైసన్‌బిన్ హదితో ఫంక్షన్ల వివరాలు తెలుసుకునేవాడు. ఈక్రమంలో రహీం, మైనర్ బాలుడిని బైక్‌పై ఫంక్షన్ హాళ్లకు తీసుకెళ్లేవాడు. అతడు ఫంక్షన్ హాళ్ల బయట ఉండగా, బాలుడు లోనికి వెళ్లి వివిధ హ్యాండ్‌బ్యాగుల నుంచి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసి పారిపోయేవారు. ఇలా కరీంనగర్, బొమ్మకల్, అలుగునూర్, హుజురాబాద్‌లోని పలు ఫంక్షన్‌హాళ్లలో బంగారు ఆభరణాలు, లాప్‌టాప్, డబ్బు చోరీ చేశారు. ఇందులో కొన్ని బంగారు ఆభరణాలను అమ్మేందుకు శనివారం సాయంత్రం మైనర్ బాలుడు, ఆటో డ్రైవర్ మైసన్‌బిన్ హాది బైక్‌పై వరంగల్ వెళ్లే క్రమంలో ఎల్‌ఎండీ ఎస్సై బి.చేరాలు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 గ్రాముల బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్లు, ఒక లాప్‌టాప్, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. మైసన్‌బిన్ హాదిని జైలుకు, బాలుడిని జువైనల్‌హోంకు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రహీంను పట్టుకునేందుకు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సృజన్‌రెడ్డి, కొత్తపెల్లి ఎస్సై సాంబమూర్తి , ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు ఆధ్వర్యంలో 4 బృందాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో దొంగలించిన సొమ్ముతో పారిపోయేందుకు రహీం కరీంనగర్ బస్టాండ్‌కు వస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్ అంజనేయులు, కానిస్టేబుల్ శ్రీనివాస్, ఎస్‌బీ, టాస్కోఫర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.


పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు రహీం

దాతలూ.. దయచూపండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లి చికిత్స కోసం తనయుడి వేడుకోలు

మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లి వైద్య ఖర్చుల కోసం దాతలు సాయం చేసి ఆదుకోవాలని తనయుడు సామాజిక మాధ్యమాల ద్వారా వేడుకుంటున్నాడు. మల్యాల మండల కేంద్రంలోని పేద కుటుంబానికి చెందిన గడ్డం రాజకుమారి ఈ నెల 22న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శస్త్ర చికిత్స కోసం రూ.6లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో తల్లిని బతికించుకునేందుకు తనయుడు అఖిలేశ్ దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నాడు. మల్యాలకు చెందిన భూక్యా రాజేందర్, పోచంపల్లి రాజు, ఆగంతపు వంశీ, పోచంపల్లి వేణు తదితరులు తమవంతు సాయం అందించగా, మరింత మంది సాయం అందించాలని కోరుతున్నాడు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజకుమారి

సాయం చేసే దాతలు
88858 88009,
ఫోన్ పే, గూగుల్ పే

ఇసుక తరలిస్తున్న వ్యక్తికి జైలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తికి సిరిసిల్ల మున్సిఫ్ కోర్టు జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారని ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని రాంరెడ్డిపల్లెలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ వాహనాన్ని ఆదివారం పట్టుకున్నట్లు చెప్పారు. టిప్పర్ యజమాని, డ్రైవర్ అయిన సిద్దిపేట జిల్లా దూలిమెట్ల మండలం మద్దూరు కొండాపూర్‌కు చెందిన ఇస్లావత్ భాస్కర్‌ను కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. రామలక్ష్మణపల్లె నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడ్డ భాస్కర్ జైలుకు వెళ్లాడన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

థియేటర్‌ను కూల్చిందెవరు..?!

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని నడిబొడ్డున ఐదు దశాబ్దాల చరిత్ర ఉన్న ఓల్డ్ అశోక థియేటర్ కూల్చివేతకు గురైంది. శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నాలుగు జేబీసీలు, 20 ట్రాక్టర్ల సాయంతో కట్టడాలను కూల్చివేసి శిథిలాలను తరలించారు. ఆ సమయంలో అక్కడున్నవారు వాగ్వాదానికి దిగగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. లీజు ప్రతిపాదికన ఓల్డ్‌అశోక థియేటర్ స్థలాన్ని సింగరేణి సంస్థ అప్పగించింది. అయితే కొంతకాలంగా థియేటర్ మూతపడటంతో తిరిగి అప్పగించాలని సింగరేణి నోటీసులు పంపగా, లీజుదారు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నట్లు సమాచారం.


కూల్చివేతకు గురైన అశోక (ఓల్డ్) థియేటర్

మరో ప్రహరీ కూల్చివేత

నగరంలో శనివారం అర్ధరాత్రి జేసీబీల సాయంతో ప్రధాన చౌరస్తా పక్కన ఉన్న ప్రహరీని కూల్చివేశారు. యాడ్స్ కోసం వినియోగించే డిసిప్లే బోర్డులను తొలగించారు. రోడ్డు వెడల్పు కోసం దీన్ని కూల్చివేసినట్లుగా తెలుస్తోంది.

కోర్టు ఉత్తర్వులున్నా కూల్చివేశారు

తనకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులున్నా బెదిరించి కూల్చివేశారని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వేముల అశోక్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్, మేయర్ కలిసి కట్టడాన్ని కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు పర్చాలని సింగరేణి యాజమాన్యం వద్దకు పలుసార్లు వెళ్లానని, అయినా టాకీస్‌ను కూల్చివేయడంతో సుమారు రూ.15లక్షల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాకు సంబంధం లేదు

కాగా అశోక టాకీస్ కూల్చివేతలో తమకు సంబంధం లేదని బల్దియా అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై పూర్వపరాలు అందుబాటులో లేవని అంటున్నారు.

ఫిర్యాదు వచ్చింది

తమ కట్టడాలను కూల్చివేశారని వేముల అశోక్ ఫిర్యాదు చేసిన విషయం వాస్తమేనని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. అయితే న్యాయ సలహా తీసుకున్న తర్వాత దీనిపై ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

చేపల మృతిపై ఫిర్యాదు


బావిలో మృతిచెందిన చేపలు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలకేంద్రం మహాసముద్రం చెరువులోని బావిలో దాదాపు 5 క్వింటాళ్ల చేపలు మృతిచెందాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కరెంట్ షాక్ పెట్టడంతో చేపలు మృతిచెందినట్లు ముదిరాజ్ కులస్తులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు నుంచి బావిలోకి చేపలు వచ్చేలా కాలువ ఏర్పాటు చేసి, అనంతరం కరెంట్ షాక్ పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వేట్రాక్‌పై మృతదేహం


రక్తపు మడుగులో మృతదేహం

రామగుండం: పెద్దంపేట–రామగుండం రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం ఓ పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడా, ఎవరైనా తోసేశారా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, దీంతో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో శవాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడు 30–40 ఏళ్ల మధ్య వయసు ఉంటాడని, నలుపు ప్యాంటు, ఎరుపు హాఫ్ షర్ట్ ధరించి ఉన్నాడని వివరించారు. ఆచూకీ తెలిసినవారు 99493 04574, 78126 58604 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముగ్గురిపై పోక్సో కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మైనర్ బాలికను వంచించిన కేసులో ముగ్గురిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కొద్ది రోజుల క్రితం పట్టణానికి చెందిన బాలికకు ముగ్గురు మాయమాటలు చెప్పడంతో పాటు అందులో ఓ వ్యక్తి ప్రేమ పేరుతో వంచించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఎస్సై వెంకట్రావు సస్పెన్షన్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా డీసీఆర్బీ ఎస్సైగా పనిచేస్తున్న వెంకట్రావును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కొడిమ్యాల ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో మహిళా కానిస్టేబుల్‌తో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణల నేపథ్యంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గల్లంతయిన యువకుడు శవంగా..

మల్లాపూర్: స్నేహితుడి బర్త్ డే వేడుకలకు వచ్చిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన సాయనుల్ల శివకుమార్(20), మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన అల్లాడి నవనీత్ స్నేహితులు. నవనీత్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు శివకుమార్ ఈనెల 22న చిట్టాపూర్ వచ్చాడు. శనివారం నవనీత్, శివకుమార్ ఈత కొట్టాలన్న సరదాతో స్నేహితులతో కలిసి వెళ్లారు. వ్యవసాయ బావిలోకి దిగిన శివకుమార్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న నవనీత్ కుటుంబసభ్యులు, గ్రామస్తులు బావి వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి గాలించగా శివకుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు.

న్యాయశాస్త్రంలో అనన్య ప్రతిభ

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కూర్మచలం అనన్య న్యాయశాస్త్రంలో 8 బంగారు పతకాలు సాధించింది. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి ప్రియదర్శిని చేతుల మీదుగా న్యాయశాస్త్రం డిగ్రీ పట్టాతో పాటు 8 బంగారు పతకాలు అందుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఆంధ్ర మహిళాసభ లా కళాశాలలో 2020–23 వరకు బ్యాచిలర్ ఆఫ్ లా కోర్సు పూర్తి చేసింది. న్యాయశాస్త్రంలోని లేబర్ లా, కాన్‌స్టిట్యూషనల్ లా, అడ్మినిస్ట్రేటివ్ లా, ఫ్యామిలీ లా, లా ఆఫ్ జూరిస్‌ప్రిడెన్స్ విభాగాలతో పాటు ఎల్‌ఎల్‌బీ ఫస్ట్, సెకండ్ ఇయర్, 2020–23 బ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు కళాశాల యజమాన్యం 8 బంగారు పతకాలతో సత్కరించింది. అనన్య తండ్రి కూర్మచలం వేణుమాధవ్ జగిత్యాల జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది కాగా, తల్లి పుష్పలత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అనన్య భర్త గొనెపట్ల అజయ్‌రెడ్డి రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ, న్యాయశాస్త్రంలో అత్యుత్తమ స్థాయికి ఎదిగేందుకు, సామాన్యుడికి సత్వర న్యాయం కోసం ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. అనన్యకు బంగారు పతకాలు రావడం పట్ల లక్ష్మీపూర్ వాసులతో పాటు జగిత్యాల కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.


హైకోర్టు జడ్జి ప్రియదర్శిని చేతులమీదుగా డిగ్రీ పట్టా, బంగారు పతకాలు స్వీకరిస్తున్న అనన్య

శివకల్యాణోత్సవానికి ముస్తాబు


ప్రత్యేక హోమ మందిరం


ముస్తాబైన రాజన్న గుడి

- ప్రత్యేక యాగశాల, హోమగుండాలు
- 28న పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణం
- 30న రథోత్సవం

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించే శివకల్యాణోత్సవానికి ముస్తాబైంది. ప్రధానాలయంలో కోడెలు కట్టే ప్రదేశంలో ప్రత్యేక హోమమందిరాన్ని ఏర్పాటు చేశారు. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 28న ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ప్రత్యేక యాగశాల, హోమగుండాలు ఏర్పాటు చేశారు. ఈనెల 30న సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు రథాలను సిద్ధం చేసి ఉంచారు.

జిలెటెన్‌స్టిక్స్ పట్టివేత

- పేలుడు పదార్థాల రవాణా చేస్తున్న వ్యక్తి కేసు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం రామారావుపల్లె శివారులోని మామిడితోటలో డిటోనేటర్లు, జిలెటెన్‌స్టిక్స్‌ను చందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని రామారావుపల్లి–సనుగుల మధ్య మామిడితోటలో పేలుడు పదార్థాలను అక్రమంగా నిలువ ఉంచారన్న సమాచారంతో దాడులు చేశారు. మామిడితోటలో డిటోనేటర్లు, జిలెటెన్‌స్టిక్స్ డంప్ చేశారన్న సమాచారంతో పోలీసులు రెండు గంటలకుపైగా గాలించారు. మామిడితోటలోని మామిడిచెట్టు కింద సంచిలో లభించిన పేలుడు పదార్థాలను బాంబుస్క్వాడ్ సిబ్బంది పరిశీలించి, డాగ్‌స్క్వాడ్‌తో గాలించారు. పోలీసులకు 24 డిటోనేటర్లు, 16 జిలెటిన్‌స్టిక్స్, డైనమో, బైండింగ్ వైరు, కంప్రెషర్ ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్న కొమిరే మల్లయ్యపై కేసు నమోదు చేశారు.


పేలుడు పదార్థాలు కోసం వినియోగించే కంప్రెషర్ ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు

- శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేశ్

కరీంనగర్‌సిటీ: సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు ఉండాలని శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేశ్ పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. సభకు వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీసెర్చ్ మెథడాలజీ కోర్సులు రీసెర్చ్ స్కాలర్స్‌కు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. విశిష్ట అతిథి ఆచార్య చన్న బసవయ్య మాట్లాడుతూ, ప్రతి రీసెర్చర్ నైపుణ్యంతో సమాజంలోని సమస్యలకు సమాధానాలు వెతికి ఉపయోగపడేలా చూడాలన్నారు. కార్యక్రమం డైరెక్టర్ డా.ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ, ఇలాంటి కోర్సు నిర్వహించడానికి తనను ప్రోత్సహించిన శాతవాహన అధికారులను, కోర్సులో చేరి విజయవంతం చేసిన రీసెర్చ్ స్కాలర్స్‌ను అభినందించారు. కోర్సు కో డైరెక్టర్ డా.ఇ.మనోహర్, బిజినెస్ మేనేజ్మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం.మనోజ్‌కుమార్, కృష్ణకుమార్, డాక్టర్ కె.తిరుపతి, అజీజ్, విజయ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహేశ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేట మండలంలోని మర్తనపేటకు చెందిన ఇరుమల్ల మహేశ్(19), కాసారపు స్నేహిత్(17) అనే ఇద్దరు స్నేహితులు ధర్మారం గ్రామానికి వెళ్లి మర్తనపేటకు తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో ధర్మారం శివారులోని పీరీలబండ సమీపంలో వీరు వెళ్తున్న బుల్లెట్ అదుపుతప్పి ఇద్దరు పడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

అలరించిన అల్ఫోర్స్ ప్రీమియర్ వేడుకలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్, పక్కన చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): అల్ఫోర్స్ శ్రీ విద్యాభారతి పాఠశాలలో ప్రీమియర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.